కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

దుండిగల్: సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కావలి గణేశ్ కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నాడు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మైనంపల్లి హన్మంతరావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, నేతలు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, మల్లేశ్ యాదవ్, అమరం ముత్యంరెడ్డి, ఆకుల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బతుకమ్మకుంట నిర్మాణం



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో నిర్మిస్తున్న బతుకమ్మ కుంట పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.20 లక్షల నిధులతో అన్ని హంగులతో ఈ నిర్మాణం చేపడుతున్నారు. 5 మీటర్ల చుట్టూ గుండ్రంగా నీరు నిలిచేందుకు రేన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్‌తో బతుకమ్మలు వేసేందుకు 0.75 లోతుతో నిర్మాణం చేస్తున్నారు. అలాగే అడ్డం 14 మీటర్లు, నిలువు 16 మీటర్ల స్థలం చుట్టూ ఎంఎస్ రేలింగ్ సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే ఈ కొలనులోకి నీటిని కూడా నింపి అధికారులు దాని నాణ్యతను చెక్ చేశారు. వీలైనంత తొందరగా పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేస్తామని గాజులరామారం ఏఈ తిరుపతి తెలిపారు.

అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న పాఠశాల కరస్పాంటెండెంట్ వినోద్‌జాదవ్

రంగారెడ్డినగర్: హెచ్.వై.ఎం.(హిమ్) ఇంటర్నేషనల్ సంస్థ అందజేస్తున్న ప్రతిభా అవార్డుకి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్‌కు చెందిన బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ ఎంపికైంది. 78వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా శుక్రవారం బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ, హెచ్‌వైఎం ప్రతినిధి ఆలపాటి శివయ్య చేతుల మీదుగా పాఠశాల కరస్పాంటెండెంట్ వినోద్‌జాదవ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ నరసింహ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభకనుగుణంగా తల్లిదండ్రులు వారు ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కృష్ణంరాజు, ఎంటమాలజిస్ట్ ఉమారాణి, సహాయకులు రజాక్, సంపత్. పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం



సూరారంలోని నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద ప్రధాన రోడ్డుపై నిలిచిన వరదనీరు

సుభాష్‌నగర్: భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సూరారంలోని నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి ముందు ప్రధాన రోడ్డు చెరువులా మారింది. ఈ ప్రధాన రోడ్డు కింద ఉన్న కల్వర్టు మూసుకుపోవడంతో వర్షపు నీరు దిగువ ప్రాంతానికి వెళ్లే మార్గంలేక రోడ్డుపై గంటల తరబడి చేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. వీధులు కుంటలను తలపించాయి.

సేవలకు తగిన ప్రోత్సాహం



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎం

జీడిమెట్ల: ఆర్టీసీలో ఉత్తమ సేవలను అందించిన వారికి తగిన ప్రోత్సాహం ఉంటుందని జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీడిమెట్ల డిపోలో ఉత్తమ సర్వీస్ అందించిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదం.. ఒకరికి గాయాలు

సుభాష్‌నగర్: ఓ ప్రార్థన మందిరం నిర్మాణంపై తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం జీఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీని ఆనుకుని ఓ వ్యక్తి ప్రార్థన మందిరాన్ని విస్తరించి నిర్మించడంపై స్థానిక యువకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య మాట పెరగడంతో గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో ప్రసాద్ అనే వ్యక్తి గాయపడ్డాడు. సంఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసీపీ, సీఐ భరత్ కుమార్ పరిశీలించారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కార్పొరేటర్ రావుల శేషగిరి ఆరా తీశారు.

నిబంధనలు బేఖాతర్



విరుద్ధంగా ఎత్తైన భవనాల నిర్మాణం
- సదుపాయాలు అంతంతే
- పట్టించుకోకుండా ఎన్‌వోసీలు జారీ చేస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో వందలాది నిర్మాణాలు చేపట్టిన రియల్ వ్యాపారులు నిబంధనలను పాటించడం లేదు. ఎన్‌ఓసీ తీసుకున్న తర్వాత మరో అంతస్తు వేసి ప్లాట్లు చేసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా గ్రేటర్ విభాగం నుంచి జోనల్ మొదలుకొని సర్కిళ్ల వారీగా టౌన్ ‘ప్లానింగ్’ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్న చర్చ జరుగుతుంది. ఇంకుడు గుంతలు, డ్రైనేజీ నిర్మాణ వ్యవస్థ, శుద్ధి కేంద్రాలు, విశాలమైన ర్యాంపులు ఏర్పాటు చేసి కొనుగోలుదారులకు అందజేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు వీటి విషయంలో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నట్లు గతంలో పలు తనిఖీల ద్వారా తేటతెల్లమైన విషయం తెలిసిందే. ఇక్కడ జరిగే అనుమతులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నప్పటికీ గ్రేటర్ టౌన్ ప్లానింగ్ విభాగం చోద్యం చూడటంతో గ్రేటర్ ఆదాయానికి భారీగా గండిపడుతూ వచ్చింది. ఈ రెండు జంట సర్కిళ్ల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వందలాది అపార్ట్‌మెంట్లు ఉన్నప్పటికీ వాటికి ఎన్‌ఓసీలు జారీ చేయడం వెనుక ఎవరి పాత్ర ఉన్నది.. అన్న విషయంపై క్షేత్రస్థాయిలో లోతుగా పరిశీలన చేస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి. కూకట్‌పల్లి జోనల్ లెవెల్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఓ అధికారి ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా ఎన్‌ఓసీలు జారీచేసి లక్షలాది రూపాయలు వసూలు చేశాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలను పక్కనపెట్టి...

గతంలో గ్రేటర్ అధికారులు 100 ప్లాట్లకు మించిన అపార్ట్‌మెంట్లకు మురుగు శుద్ధి కేంద్రం తప్పనిసరి అని తేల్చి చెప్పారు. కానీ జంట సర్కిళ్ల పరిధిలో ఇటువంటి నిర్మాణాలు ఎన్నో జరిగినా.. నిర్మాణ సంస్థలు ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకొని అధికారులను మేనేజ్ చేసుకుంటూ వచ్చారు. ఫలితంగా అపార్ట్‌మెంట్ల డ్రైనేజీ మొత్తం ఎక్కడపడితే అక్కడ పొంగి పొర్లుతుంది. అపార్ట్‌మెంట్ నిర్మాణం పూర్తై ఎస్టీపీ ఉంటేనే ఎన్‌ఓసీ ఇవ్వాల్సిన అధికారులు ఆ విషయాన్ని పక్కన పెట్టి గుడ్డిగా వాటిని జారీ చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత అధికారులపై, నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేపు పాటల పోటీలు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం ప్రగతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ సోలో సాంగ్స్ పోటీల్లో పాల్గొనే వారికి ఉదయం 9 గంటలకు మొదటి రౌండ్ నిర్వహిస్తారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 30 శాతం మందిని రెండవ రౌండ్‌కు ఎంపిక చేయనున్నారు. అదే విధంగా రెండవ రౌండ్‌లో మూడు అత్యుత్తమ పాటలు ఆలపించిన వారిని తుది విజేతగా ఎంపిక చేయనున్నారు. పోటీదారులు 45 నిముషాల ముందు రిపోర్ట్ చేయాలని, అదే విధంగా వారి వెంట ఆధార్ కార్డును తేవాలని నిర్వాహకులు సూచించారు. మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నారు.

నేడు ఓపీ సేవలు బంద్

కుత్బుల్లాపూర్: కలకత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచార ఘటనకు నిరసనగా కొంపల్లి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సుచిత్రా నుంచి జీడిమెట్ల గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని, అదే విధంగా శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు కొంపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ఏరోనాటికల్ కళాశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన



దుండిగల్: దుండిగల్‌లోని ఏరోనాటికల్ ఇంజినీరింగ్, ఎంఎల్‌ఆర్‌ఐటీఎం కళాశాలల వద్ద ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. మేనేజ్‌మెంట్ కోటా కింద ముందస్తుగా డబ్బులు వసూలు చేసి తరువాత విద్యార్థులకు ప్రవేశాలు కల్పించకపోవడంతో నాలుగు రోజులుగా పలు విద్యార్థి సంఘాలు నిరసన చేపడుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. వర్షంలో సైతం ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, టి. నాగరాజు మాట్లాడుతూ.. ఏరోనాటికల్ ఇంజినీరింగ్, మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలల్లో డొనేషన్ల పేరుతో కోట్ల రూపాయలను వసూలు చేశారన్నారు. ఆందోళన చేస్తున్న క్రమంలో విద్యార్థి నేతలకు, కళాశాల యాజమాన్యానికి తోపులాట జరిగింది. దుండిగల్ పోలీసులు జోక్యం చేసుకుని ఇరువురికి సర్ది చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కార్తిక్, రాథోడ్ సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, జిల్లా కమిటీ సభ్యులు భగత్, నాయకులు అజయ్, నందీశ్వర్, కరుణాకర్, శ్రీకాంత్, సాయిరాం, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో తీజ్ నిమజ్జన మహోత్సవం



నిమజ్జన మహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూలో శుక్రవారం తీజ్ నిమజ్జన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ విజయ కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ జీఎస్ నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భోగ్ బండార్ కార్యక్రమంతో ఈ ఉత్సవం ప్రారంభమైంది. బంజారా విద్యార్థినులు తీజ్ బుట్టలను భక్తి శ్రద్ధలతో అమ్మవారికి, సేవాలాల్ మహారాజ్‌కి సమర్పించారు. తీజ్ మొక్కల్ని పూజించి యూనివర్సిటీ అధికారుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షుడు వినోద్ నాయక్, పూర్వ అధ్యక్షులు నరేందర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకాశ్ నాయక్, సింహాద్రి, భూక్య, విష్ణు నాయక్, లకావత్ లైలా, బానోత్ అనూష, గౌతమి, అరుణ, శిరీష, హర్షిని, బాలకృష్ణ, కోటియా నాయక్, రీసెర్చ్ స్కాలర్స్ అవినాష్ పాల్గొన్నారు.

10వ తేదీలోగా అడ్మిషన్ పొందాలి

చింతల్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల(తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ) కి సంబంధించిన 2024-2025 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్ అడ్మిషన్లు జరుగుచున్నాయని కళాశాల ప్రిన్సిపాల్, టాస్ కోఆర్డినేటర్ నాగేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీలోగా అడ్మిషన్ పొందాలన్నారు. వివరాల కోసం అసిస్టెంట్ కో ఆర్డినేటర్ పిడమర్తి, ఉపేందర్ రావులను సంప్రదించాలని, ఇతర వివరాలకు 9959910131 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సుభాష్‌నగర్: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలు పురస్కరించుకొని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇంట్లో భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ దయార్‌గూడకు చెందిన సింగూరి నర్సింగరావుకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్

ఉస్మానియా యూనివర్సిటీ: వచ్చే నెల 14, 15 తేదీల్లో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గోపాల్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌ను ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి ఇతరులు కూడా హాజరుకావచ్చని తెలిపారు. ఆయన వెంట డా.విద్యాసాగర్, డా.దరువు ఎల్లన్న, రాఘవేంద్రరెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: విద్యుత్ లైన్ మరమ్మతుల సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ, బండారి లేఅవుట్ 5 నుంచి 10వ నెంబరు వీధుల్లో విద్యుత్ ఉండదని ఏఈ పేర్కొన్నారు.

బాచుపల్లి సెక్షన్ పరిధిలో..

హెచ్‌ఎండీఏ రోడ్డు వెడల్పు పనుల సందర్భంగా 11కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్రాంతి నగర్ కాలనీ, శ్రీహోమ్స్ కాలనీ, బాచుపల్లి సిగ్నల్స్ నుంచి దర్బార్ మెయిన్ రోడ్డు వరకు విద్యుత్ సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తెలిపారు.

బౌరంపేట్ సెక్షన్ పరిధిలో..

11 కేవీ కోకకోలా ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు డాలర్ డ్రీమ్స్, నెస్ట్ విల్లాస్, కేఎల్ యూనివర్సిటీ, 11కేవీ ఏజీఓ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్ ఆర్‌ఆర్ హైట్స్, డీపీఎస్ స్కూల్, మైస్పేస్-2 ప్రాంతాల్లో, 11కేవీ బాలాజీ ఫీడర్ పరిధిలో మధాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు బాలాజీ ఎన్‌క్లేవ్, ప్రణీత్ జెమ్స్, 11కేవీ బౌరంపేట్ ఫీడర్ పరిధిలో సారెగూడెం రోడ్డు, వజ్రా, కింగ్స్ బార్ రోడ్డు, వేదా స్కూల్ ఏరియాల్లో విద్యుత్ ఉండదని ఏఈ సాయికిరణ్ తెలిపారు.

సుభాష్‌నగర్: ఫీడర్ లైన్ల మరమ్మతుల సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు కృష్ణ మహాలక్ష్మినగర్, శారదా కాలనీ, మోడీ ఎలగెన్స్, ఒక్షిత ఎన్‌క్లేవ్, 11కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంబేడ్కర్‌నగర్, ఉమాదేవినగర్, చంద్రగిరినగర్, 11కేవీ క్రషర్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు కైసర్‌నగర్, దేవేందర్‌నగర్, జీఎన్ఎన్‌యుఆర్‌ఎం, వీనస్ రాక్‌హైట్స్, ఆర్‌వీఎన్‌ఆర్ నగర్, పోచమ్మబస్తీ, బతుకమ్మబండ, సాబేర్‌నగర్, 11కేవీ కై లాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు మహదేవపురం, షిర్డీహిల్స్, కైలాస్ హిల్స్, బాలయ్య బస్తీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కుత్బుల్లాపూర్: విద్యుత్‌ఫీడర్ లైన్ల నిర్వహణ సందర్భంగా శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ దూలపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు దూలపల్లి గ్రామం, అశోక ఏలా మైసన్ ఫేజ్-1, 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సిటీ ప్లానెట్, ఎస్‌సీఎల్ నార్త్, ఎస్‌సీఎల్ సాయిబాబా, 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు జయభేరి కాలనీ, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస కాలనీ, 11కేవీ స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు, 11కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 1:30 గంటల వరకు అపర్ణపామ్స్ గ్రోవ్, సెంట్రల్ పార్కు, మికాసా స్టెర్లింగ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో..

పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలోని మీనాక్షి, జీడిమెట్ల, జైన్ కన్‌స్ట్రక్షన్స్, సుచిత్ర, ప్రాగా టూల్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ



ఆల్విన్‌కాలనీ: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని మల్లికార్జున స్వామి దేవాలయంలో కొలువుదీరిన భ్రమరాంబ అమ్మవారిని కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు అఖిలేశ్వర శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సామూహిక మంగళ గౌరీవ్రతం చేశారు.



ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీజేఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి తదితరులు - కుత్బుల్లాపూర్

యువత భవితకు వెలుగుల దివ్వె

పేద, మధ్య తరగతి వర్గాలకు చేయూతనిస్తున్న లైట్ హౌస్

- కంప్యూటర్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు
- మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక కోర్సులు
- జీహెచ్‌ఎంసీ, దాతల అండతో నిర్వహణ




చందానగర్ హుడా కాలనీలోని లైట్ హౌస్



టైలరింగ్ శిక్షణ తీసుకుంటున్న మహిళలు

చందానగర్: నేడు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగం రాని పరిస్థితి. దీన్ని దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర పూణెకు చెందిన గణేష్ నటరాజన్, రుచి మాథుర్‌లు కలిసి ‘లైట్ హౌస్’ కమ్యూనిటీస్‌ను ప్రారంభించారు. యువతకు అవసరమైన పరిజ్ఞానంతో బాటు మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీతో పాటు 22 కోర్సులలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, దాతలతో లైట్ హౌస్‌లు ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇస్తున్నారు. పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూలకు ఎలా సిద్ధం కావాలి, ఇంగ్లిష్‌లో మాట్లాడడం.. వీటన్నింటిని ఉచితంగా నేర్పిస్తున్నారు చందానగర్ హుడా కాలనీలో ‘లైట్ హౌస్’ కమ్యూనిటీస్‌లో. ఈ శిక్షణ బయట తీసుకోవాలంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఈ నేపథ్యంలో పలువురికి దారి చూపుతున్నారు ఈ కేంద్రం నిర్వాహకులు. ఇప్పటి వరకు పూణె, ఒడిశా ,ముంబై, ఢిల్లీ, లక్నో, హైదరాబాద్‌లలో 32 లైట్ హౌస్ కేంద్రాలు ఉన్నాయి. శిక్షణ కోర్సులు ఉచితంగా నేర్పించి 80 శాతం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఇక్కడకు ఐటీ ఉద్యోగులు సైతం వచ్చి బోధిస్తున్నారు. కాగా నగరంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో కూకట్‌పల్లి, బోరబండ, మల్లేపల్లి, ఎల్బీనగర్‌లలో మరో నాలుగు లైట్‌హౌస్‌లు ఏర్పాటు చేయనున్నారు.

- రాష్ట్రంలో మొట్టమొదటి లైట్ హౌస్‌ను 2023 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీతో కలిసి చందానగర్ హుడా కాలనీలో ఉన్న మోడల్ మార్కెట్ భవనంలో ఏర్పాటు చేశారు.



కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న యువత

- యువతీ, యువకులకు సుమారు 22 రోజులు ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పేద, మధ్య తరగతి యువత వచ్చి వారికి కావలసిన కోర్సులలో శిక్షణ పొందుతున్నారు.
- యువకులకు కంప్యూటర్‌తో పాటు వారికి కావలసిన ట్యాలీ, జావా వంటి కోర్సులు, ఇంటర్వ్యూలకు స్పోకెన్ ఇంగ్లిష్ కూడా నేర్పిస్తున్నారు.
- బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానం, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇస్తున్నారు.
- ఆయా కోర్సులకు సంబంధించి తరగతి గది, గ్రూప్ డిస్కషన్ కోసం, కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ గదులు నిర్మించారు.
- లైట్ హౌస్‌లో 12 మంది ట్రైనర్లు శిక్షణ ఇవ్వడానికి అందుబాటులో ఉన్నారు.
- ఫౌండేషన్ కోర్సు 22 రోజులు. 3 నెలల పాటు స్కిల్స్ నేర్పిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.
- 2023 సంవత్సరం నుంచి నేటి వరకు 40 బ్యాచ్‌లతో 920 మంది యువత నైపుణ్యం కోసం నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 418 మంది ఉద్యోగ అవకాశాలు అందించాం. 291 మందికి వివిధ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్నారు.
- లైట్ హౌస్‌లో కోర్సులలో చేరాలంటే 18-35 సంవత్సరాల వయో పరిమితి ఉంది. ఆధార్ కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్ ఉండాలి.

ఉచిత శిక్షణ



చందానగర్‌లోని లైట్ హౌస్‌లో పేద, మధ్య తరగతి యువతకు కంప్యూటర్ తదితర కోర్సులు ఉచితంగా నేర్పిస్తున్నాం. ప్రభుత్వ సహాయంతో లైట్ హౌస్ కేంద్రాలను విస్తరిస్తున్నాం. 40 బ్యాచ్‌లతో 920 మంది యువత శిక్షణ కోసం నమోదు చేసుకున్నారు.

-శ్రీనివాస్ ఆకుల, లైట్ హౌస్ ప్రోగ్రాం మేనేజర్

సెల్లార్ తవ్వకం.. కూలిన పక్కింటి ప్రహరీ



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ధర్మారెడ్డికాలనీ ఫేజ్-2లో సెల్లార్ నిర్మాణం కోసం గుంత తవ్వగా పక్క ఇంటికి సంబంధించిన ప్రహరీ కూలింది. దీంతో స్థానికంగా నిర్మాణం చేపడుతున్న ప్లాట్ యజమానికి, ప్రహరీ గోడ కూలిపోయిన ఇంటి యజమానికి మధ్య వివాదం మొదలైంది. వివరాల్లోకి వెళితే..ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-2లోని ఎంఐజీ- 96కు సంబంధించి సెల్లార్ తవ్వకం పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎలాంటి సపోర్ట్ లేకుండా ఉన్న పక్కనే ఉన్న ఎంఐజీ-52 ఇంటి ప్రహరీ కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై ఫిర్యాదు చేయనున్నట్లు ధర్మారెడ్డికాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు.